తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
11-07-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 153
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## ఆరోగ్య ట్రస్ట్‌లోకి ఉద్యోగుల డబ్బులు..!

- ఆరోగ్యం క్షీణిస్తే మాత్రం సొంత ఖర్చులు తప్పవు
- తెలంగాణాలో ఉద్యోగుల హెల్త్ ప్రశ్నార్థకం
- హైకోర్టు మొట్టికాయలు వేసినా మారని సర్కారు తీరు
- జూన్ 1 నుండి కొత్త విధానం అమలు చేస్తామని చెప్పి.. నేటికీ తేల్చని రాష్ట్ర ప్రభుత్వం

2



## ఖమ్మం సభకు వెయ్యి బస్సులు!

- సీఎం సభ కోసం తరలింపు.. నగరంలో స్తంభించిన రవాణా
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు
- అదును చూసి దోచుకున్న ప్రైవేట్ వాహనదారులు, ఆటో వాలాలు



2



# ఆపరేషన్ తెలంగాణ !

- 'వలసల' గేట్లు ఎత్తనున్న కమలం పార్టీ
- సంస్థాగత బలోపేతంతో పాటు చేరికలపై బీజేపీ స్పెషల్ ఫోకస్
- 'మిషన్ 2028' లక్ష్యంగా ఢిల్లీ పెద్దల వ్యూహాలు
- నిస్తేజంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కీలక నేతలకు గాలం..
- బూత్ స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ
- వలసల ప్రోత్సాహంతో డబుల్ ఇంజన్ వ్యూహం

**(తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్):**

తెలంగాణలో అధికార పీఠమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన రాజకీయ వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకోవడంతో పాటు, లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్య విజయాలు సాధించిన జోష్‌లో ఉన్న కమలనాథులు.. ఇప్పుడు రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా మిషన్ 2028 లక్ష్యంగా పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. కేవలం సంస్థాగత బలోపేతంపైనే ఆధారపడితే అనుకున్న మార్కును రీచ్ అవ్వడం కష్టమని భావిస్తున్న అధిష్ఠానం.. ఇప్పుడు ఇతర పార్టీల నుండి బలమైన నాయకులను చేర్చుకునే వలసల వ్యూహాన్ని ముమ్మరం చేయడానికి సర్వం సిద్ధం చేసింది. రాష్ట్రంలో బీజేపీని క్షేత్రస్థాయిలో తిరుగులేని శక్తిగా మార్చేందుకు సంస్థాగత ప్రక్షాళనను శరవేగంగా చేపడుతోంది.

**బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ...**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 35 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో పటిష్టమైన కమిటీలను ఏర్పాటు చేస్తోంది. డిజిటల్ మెంబర్‌షిప్ ద్వారా క్షేత్రస్థాయి కార్యకర్తలను అనుసంధానిస్తోంది. తెలంగాణలో

మిగతా 2వ పేజీలో..

## ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం

- కండూ ఏఐ హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించిన కేటీఆర్



**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్ :**

హైదరాబాద్‌లో ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ కండూ ఏఐ ఏర్పాటు చేసిన ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 3వ పేజీలో..

## వైటీపీఎస్ టెండర్ల గడువు పెంపు

- ఉద్యోగుల తీవ్ర వ్యతిరేకతకు తలొగ్గిన జెన్కో యాజమాన్యం
- కోల్, యాష్ నిర్వహణ ప్రైవేటు భాగస్వామ్యంపై సర్కారు సందిగ్ధం
- టెండర్ గడువును 24వ తేదీ వరకు పొడిగించిన ప్రభుత్వం

3



## తయారీ రంగానికి అత్యంత అనుకూలం

- పెట్టుబడులకు జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి
- జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు




**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్ :**

తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు,

మిగతా 2వ పేజీలో..

## ఏసీబీ పేరిట బెదిరింపులు

- రెవెన్యూ అధికారిని బురిడీ కొట్టించిన సైబర్ కేటుగాళ్లు
- కేసు నమోదు చేస్తామంటూ భయపెట్టి రూ.లక్ష కాజేత
- సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు

2

## పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా?

- కన్నెపల్లినుంచి నీటిని లిఫ్ట్ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థత
- హైదరాబాద్‌కు నీటి సమస్య వస్తే ఎట్లా పరిష్కరిస్తారు?
- సుందిళ్లనుంచి ఎల్లంపల్లికి నీరెందుకు తరలించరు?
- మళ్లీ జలదోపిడీకి తలుపులు తెరిచారు
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన హరీష్‌రావు

3



## అత్తాపూర్‌లో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు



- ఎండీఎంఏ డ్రగ్స్, భారీ సంఖ్యలో ఇంజెక్షన్ల స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్.. ప్రాణాంతక ఆయుధాలు కూడా స్వాధీనం

2

## స్వరాష్ట్ర సాధనలో కార్మిక సంఘాలదే కీలక పాత్ర

- ట్రేడ్ యూనియన్ల పోరాటాన్ని కొనియాడిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్ :**

స్వరాష్ట్ర సాధనలో ట్రేడ్ యూనియన్ల పాత్ర అత్యంత కీలకమైనదని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముక్తకంఠంతో కొనియాడింది. నాడు ఆర్టీసీ, సింగరేణి, రైల్వే, బీఎస్ఎన్ఎల్, టీజేఏసీ ఉద్యోగులతోపాటు అసంఘటిత రంగ కార్మికులు రోడ్లపైకి వచ్చి సకల జనుల సమ్మె ద్వారా యావత్ ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపజేయడం వల్లే నాటి దిల్లీ పీఠం దిగివచ్చిందని గుర్తు చేసింది. కార్మిక లోకం అందించిన ఆ చరిత్రాత్మక మద్దతు లేకపోతే తెలంగాణ కల సాకారం అయ్యేది కాదని, అందుకే ఉద్యమ

మిగతా 2వ పేజీలో..






## పెండింగ్ పనుల్లో వేగం పెంచాలి

- వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం
- 15వ తేదీలోగా విద్యుత్ బకాయిల వసూళ్లు పూర్తి చేయాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

3

# ఆరోగ్య ట్రస్ట్‌లోకి ఉద్యోగుల డబ్బులు..!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో కంటికి రెప్పలా కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యం ఇప్పుడు తీవ్ర ప్రశ్నార్థకంగా మారింది. ఉద్యోగులకు, రిటైర్డ్ సిబ్బందికి మెరుగైన వైద్యం అందిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్ట్' ఇప్పుడు ఆసుపత్రి వైపే వెళ్లలేని దారుణ పరిస్థితిని కల్పిస్తోంది. కొత్త హెల్త్ పాలసీ పేరుతో తెచ్చిన ఈ విధానం పూర్తిగా అబాసుపాలవుతోంది. పాత హెల్త్ కార్డుల విధానంలో కార్పొరేట్ ఆసుపత్రులు ఉచిత వైద్యం అందించడం నిలిపివేయడం, కొత్త విధానాన్ని ప్రభుత్వం ఇంకా పూర్తిస్థాయిలో పట్టాలెక్కించకపోవడంతో దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఆందోళనలో పడిపోయారు.

**డబ్బులు కట్.. కానీ వైద్యం నిల్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈ కొత్త ట్రస్ట్‌లో గత రెండు నెలలుగా ఉద్యోగుల భాగస్వామ్యం కింద ఏకంగా రూ.88 కోట్ల రూపాయలు జమయ్యాయి. కానీ, సర్కారు ఉద్యోగులకు ఇచ్చిన భరోసా మాత్రం కేవలం కాగితాలకే పరిమితమైంది. గత రెండు నెలలుగా అటు పాత విధానం కొనసాగక, ఇటు కొత్త విధానం అమలు కాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో చేరుతున్న ఉద్యోగులు గత్యంతరం లేక తమ సొంత డబ్బులను లక్షల రూపాయిల్లో ఖర్చు పెట్టుకుంటున్నారు. మా జీతాల నుండి ప్రతి నెల 1.5 శాతం డబ్బులను కోత విధిస్తూ ట్రస్ట్‌కు మళ్లిస్తున్నారు.. తీరా మాకు ఆరోగ్యం క్షీణిస్తే మాత్రం మళ్లీ జేబుల నుండి సొంత ఖర్చులు పెట్టుకోవాలా? ఇదెక్కడి న్యాయం? అని ఉద్యోగ లోకం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా పెదవి విరుస్తోంది.

**హైకోర్టు మొట్టికాయలు..**

ఉద్యోగులకు హక్కుగా ఇవ్వాల్సిన ఆరోగ్య భద్రత కోసం వారి శ్రమ నుండి భాగం (జీతంలో కోత) అడగటంపై ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఒక వైద్య శాఖ ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌తో కూడిన ఉన్నత ధర్మాసనం సర్కారు నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. 'ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత అనేది వారి హక్కు. అందుకోసం వారి జీతాల నుండి డబ్బులు కట్ చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిందే' అని హైకోర్టు ధర్మాసనం చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్రభుత్వానికి గట్టి చురకలు అంటించింది. కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోవడం విచారకరం.

**ప్రైవేటు పాలసీ కట్టినా బాగుండేది**

ప్రభుత్వం అందిస్తున్న ఈ అరకొర హెల్త్ పాలసీ కంటే తాము సొంతంగా ప్రైవేటు ఇన్సూరెన్స్ కట్టుకున్నా బాగుండేదనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. 'ప్రభుత్వ పాలసీ వల్ల మా జీతంలో కోత పడుతోంది.. తీరా ఆసుపత్రికి వెళ్తే బిల్లు మనమే కట్టాల్సి వస్తోంది. అదే డబ్బులతో మేమే నేరుగా ఏదైనా ప్రైవేటు ఆరోగ్య భీమా కట్టుకుని ఉంటే.. ఇంతకంటే తక్కువ ఖర్చుతో అత్యుత్తమ కార్పొరేట్ వైద్యం, మెరుగైన సౌకర్యాలు దక్కేవి కదా' అని ఉద్యోగులు వాపోతున్నారు.

**కొత్త విధానం అమల్లోకి వచ్చేది ఎన్నడు?**

వాస్తవానికి జూన్ 1వ తేదీ నుండే ఈ కొత్త హెల్త్ పాలసీని పకడ్బందీగా అమలు చేస్తామని ప్రభుత్వం గతంలో గంభీర ప్రకటనలు చేసింది. కానీ, జూన్ దాటి జులై వస్తున్నా.. ఇప్పటివరకు ఈ పాలసీని అసలు ఎలా అమలు చేయాలి? గైడ్‌లైన్స్ ఏంటి? ఆసుపత్రులకు నిధులు ఎలా విడుదల చేస్తారు? అనే విషయాలపై ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేకపోయింది. ఒకవైపు వేతనాల్లో కటింగ్స్, మరోవైపు ఆసుపత్రుల్లో సొంత ఖర్చుల డబుల్ బాదుడుతో నలిగిపోతున్న ఉద్యోగ వర్గాలను కాపాడేందుకు ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని, ఈ నకిలీ వైద్య భరోసాకు స్వస్తి పలికి తక్షణమే ఉచిత కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఖమ్మం సభకు వెయ్యి బస్సులు!

**హైదరాబాద్, జులై 10 (సిరి న్యూస్):**

ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆర్టీసీ బస్సులను తరలించడం నగరవాసులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే 3వేల బస్సుల్లో ఏకంగా వెయ్యి బస్సులను సభకు మళ్లించడంతో, నగరంలో రవాణా వ్యవస్థ చిన్నాభిన్నమైంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 డిపోల నుండి మూడవ వంతు బస్సులను ఖమ్మం తరలించడంతో, రోజువారీ అవసరాల కోసం బయటకు వచ్చిన వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉన్న బస్సులు కూడా ప్రారంభ పాయింట్‌లోనే నిండిపోవడంతో, మధ్య స్టేజీల వద్ద వేచి చూసే వారికి బస్సులో ఎక్కే అవకాశం కూడా లేకుండా పోయింది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**అదును చూసి దోచుకున్న ప్రైవేటు వాహనాలు**

ఆర్టీసీ బస్సుల కొరతను ఆసరాగా చేసుకున్న ఆటో వాలాలు, ప్రైవేటు వాహనదారులు అడ్డగోలుగా ధరలను పెంచేశారు. సాధారణ రోజులతో పోలిస్తే నాలుగైదు రెట్లు ఎక్కువ వసూలు చేస్తూ ప్రయాణికులను దోచుకున్నారు. గండి మైసమ్మ నుండి సికింద్రాబాద్ వరకు రూ. 300 నుండి రూ. 500 వరకు డిమాండ్ చేసినట్లు ప్రయాణికులు ఆరోపించారు. గత్యంతరం లేక సామాన్యులు అడిగినంత చెల్లించాల్సి వచ్చింది.

**మెట్రోకు భారీగా పెరిగిన రద్దీ..**

బస్సుల కొరతతో ప్రయాణికులందరూ మెట్రో రైలును ఆశ్రయించడంతో మెట్రో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. శుక్రవారం కావడంతో మెట్రో రైళ్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. నగరవ్యాప్తంగా ప్రజా రవాణా వ్యవస్థపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ అవసరాల కోసం బస్సులను మళ్లించడం వల్ల సామాన్య ప్రజలు పడిన కష్టాలు వర్ణనాతీతం.

# ఏసీబీ పేరిట బెదిరింపులు

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్**

"మీపై అవినీతి కేసు నమోదు కాకుండా ఉండాలంటే వెంటనే రూ.లక్ష పంపాలి" అంటూ ఏసీబీ అధికారుల పేరుతో ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు ఓ రెవెన్యూ అధికారిని బురిడీ కొట్టించి రూ.లక్ష కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. చేర్యాల తహశీల్దార్ ఇటీవల ఏసీబీకి చిక్కిన ఘటనను ఆసరాగా చేసుకుని ఈ మోసానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చేర్యాల తహశీల్దార్ ఏసీబీకి చిక్కిన తర్వాత అక్కడి రెవెన్యూ అధికారుల్లో నెలకొన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. మీపై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయని, కేసు నమోదు కాకుండా ఉండాలంటే వెంటనే డబ్బులు చెల్లించాలని పలువురు రెవెన్యూ అధికారులకు ఫోన్ కాల్స్ చేసి బెదిరించడం ప్రారంభించారు. ఈ క్రమంలో చేర్యాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఏసీబీ అధికారులు మాట్లాడుతున్నామని నమ్మించి, కేసు నుంచి తప్పించుకోవాలంటే వెంటనే రూ.లక్ష తమ ఖాతాకు బదిలీ చేయాలని ఒత్తిడి తెచ్చారు. అకస్మాత్తుగా వచ్చిన ఈ కాల్‌తో తీవ్ర ఆందోళనకు గురైన అధికారి వారు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.లక్ష బదిలీ చేశారు.

డబ్బులు పంపిన కొద్దిసేపటి తర్వాత అనుమానం వచ్చిన అధికారి తిరిగి అదే నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌గా రావడంతో మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డబ్బు బదిలీ అయిన ఖాతా, ఫోన్ నంబర్ల వివరాలను సేకరించి నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ ఘటన నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సహా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. దర్యాప్తు సంస్థలు, ప్రభుత్వ శాఖల పేరుతో ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినా నమ్మవద్దని, ఎలాంటి ఒత్తిడికీ లోనై నగదు బదిలీ చేయవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్**

"హైదరాబాద్‌లో నిర్వహించే ఆషాఢ బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీక. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి" అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే గోల్కొండ బోనాల ఉత్సవాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తులకు ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక సదుపాయాలు, ప్రత్యేక బస్సులు, క్యూ లైన్లు, బారికేడ్లు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. జూలై 16న లంగర్‌హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే తొలి బోనం, తొట్టెల ఊరేగింపు, రథోత్సవం, మెట్ల పూజకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలను సూచించారు. దేవాలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మొబైల్ మరుగుదొడ్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, అత్యవసర అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. గోల్కొండ కోట పరిధిలోని రహదారులు, మెట్లు, విద్యుత్ దీపాలు, సూచిక బోర్డులు, విశ్రాంతి షెడ్లు వంటి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని చెప్పారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనే శివసత్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, భక్తుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అవసరమైతే పోలీసు నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని మంత్రి పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని సౌకర్యవంతంగా దర్శించుకుని సంతృప్తిగా ఇళ్లకు చేరేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. సమావేశం అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జగదాంబిక మహంకాళి అమ్మవారిని ప్రార్థించారు.

# స్వరాష్ట్ర సాధనలో కార్మిక సంఘాలదే కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

చరిత్రలో వారికి అగ్రతాంబూలం దక్కుతుందని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం మొదటి అంతస్తులో శుక్రవారం జరిగిన ముఖాముఖి సంప్రదింపుల ప్రక్రియలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ (ఎమ్మెల్సీ), అద్దంకి దయాకర్ (ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మోతె శోభన్ రెడ్డి, ఎస్.రాములు నాయక్ కార్మిక సంఘాల పాత్రపైనే ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, అసంఘటిత రంగ కార్మిక శ్రేణులు కమిటీకి తమ వినతులను సమర్పించారు.

**ఉద్యమకారుల ప్రధాన వినతులు, డిమాండ్లు**

1969 నాటి ఉద్యమకారులతోపాటు హాజరైన వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరుతూ ప్రధాన డిమాండ్లను రాతపూర్వకంగా సమర్పించారు. నాడు పోరాడిన ప్రతి కార్మిక యోధునికి, ఉద్యమకారునికి ప్రభుత్వ ముద్రతో కూడిన అధికారిక ప్రశంసా పత్రాలు అందించి గౌరవించాలి. అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి నివాస అవసరాల నిమిత్తం 250 గజాల భూమిని ప్రభుత్వం కేటాయించాలి. ఉద్యమకారులకు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారుల జీవన భృతి కోసం శాశ్వత ప్రాతిపదికన నెలవారీ పెన్షన్ అందించాలని, ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని కోరారు.

**కమిటీ చైర్మన్, సభ్యుల హామీ**

కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్మికులు కోరిన ఈ సంక్షేమ ఫలాలు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, నాడు రక్తం, చెమట చిందించి సాధించుకున్న వారి హక్కు అని ఉద్ఘాటించారు. ఈ డిజిటల్ రికార్డింగ్ ప్రక్రియ ఆధారంగా ప్రతి ఒక్క నిజమైన కార్మిక ఉద్యమకారుడి పేరును రికార్డుల్లో ఎక్కించి తీరుతామని భరోసా ఇచ్చారు. ఈ వినతులన్నింటినీ క్రోడీకరించి ఒక పటిష్టమైన, సమగ్రమైన నివేదికను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి సమర్పించి అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని కమిటీ చైర్మన్ కేశవరావు హామీ ఇచ్చారు.



# తయారీ రంగానికి అత్యంత అనుకూలం

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచస్థాయి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బవేరియన్(జర్మనీ) మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ అఫైర్స్, రీజినల్ డెవలప్మెంట్ అండ్ ఎనర్జీ వైస్ మినిస్టర్ టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ భేటీలో తెలంగాణజర్మనీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలపై చర్చించారు. పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, ఏరో స్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, సెమీకండక్టర్లు, ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ, ఏఐ, డిజిటల్ హెల్త్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్, క్లీన్ ఎనర్జీ, జీసీసీలు, ఇండస్ట్రీ 4.0 తదితర రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయన్నారు. అత్యాధునిక సాంకేతికత, పరిశోధన, ఇన్నోవేషన్, స్కిల్లింగ్‌కు ప్రాధాన్యమిస్తూ ఈ రంగాల్లో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణజర్మనీ మధ్య భాగస్వామ్యాన్ని పెట్టుబడులకు మాత్రమే పరిమితం కాకుండా సాంకేతికత, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాలకూ విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ ఈడీ ఉల్రికే హాఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయ ఈడీ జాన్ కొట్టాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్**

"హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాపై దాడులు నిర్వహించి ఎండీఎంఏ డ్రగ్స్, భారీ మొత్తంలో మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నాం. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నాం" అని పోలీసులు తెలిపారు.

రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అత్తాపూర్‌లోని జలాల్‌బాబా నగర్‌లో నిర్వహించిన మెరుపు దాడుల్లో 8 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు భారీ సంఖ్యలో మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అబ్దుల్ హసన్‌తో పాటు ముజాహిద్‌ను అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.

డ్రగ్స్ విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారంతో అబ్దుల్ హసన్ నివాసంపై దాడులు నిర్వహించగా ఇంట్లో దాచి ఉంచిన ఎండీఎంఏ డ్రగ్స్, ఇంజెక్షన్లు బయటపడ్డాయి. ప్రాథమిక విచారణలో బెంగళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను తెప్పించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే గుజరాత్ నుంచి మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు తెప్పించి ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా నగరంలో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

శరీర దారుఢ్యం పెంచుకోవాలనే ఉద్దేశంతో కొందరు యువకులు ఈ ఇంజెక్షన్లను వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వైద్యుల సూచన లేకుండా ఇటువంటి ఇంజెక్షన్ల విక్రయం చట్టవిరుద్ధమని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రధాన నిందితుడు అబ్దుల్ హసన్‌పై హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే దారి దోపిడీ, హత్య, రౌడీషీటర్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఇటీవల పాతబస్తీలో జరిగిన హత్య కేసులో కూడా అతడు ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్స్, భారీ సంఖ్యలో ఇంజెక్షన్లతో పాటు పలు ప్రాణాంతక ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అత్తాపూర్ పోలీసులు డ్రగ్స్ నెట్‌వర్క్‌లో మరెవరి ప్రమేయం ఉందనే కోణంలో, సరఫరా వ్యవస్థపై సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఆపరేషన్ తెలంగాణ !

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత కీలకమైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఆకట్టుకునేలా ఆయా సామాజిక వర్గాల నేతలకు పార్టీ పదవుల్లో, కమిటీలలో పెద్దపీట వేస్తూ సామాజిక సమతుల్యతను పాటిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో జాప్యం, నిరుద్యోగ సమస్యలపై నిరంతరం రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయడం ద్వారా తామే అసలైన ప్రతిపక్షం అనే సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది.

**వలసలకు గ్రీన్ సిగ్నల్..**

**గేట్లు ఎత్తనున్న అధిష్ఠానం...**

బీజేపీ కేవలం కేడర్ నమ్ముకుంటే సరిపోదని, ఎన్నికల్లో గెలవగలిగే 'విన్నింగ్ హార్సెస్' (బలమైన నాయకులు) కావాలని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నుండి వలసలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా చేరికల కమిటీలను యాక్టివ్ చేస్తున్నారు. ప్రస్తుతం తీవ్ర నిరాశలో ఉన్న భారత రాష్ట్ర సమితికి చెందిన ద్వితీయ శ్రేణి నేతలతో పాటు, కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలను టార్గెట్ చేస్తూ కమలం గూటికి చేర్చేందుకు రాయబారాలు నడుపుతున్నారు. అలాగే అధికార కాంగ్రెస్ పార్టీలో పదవులు దక్కక, ప్రాధాన్యత లేక అసంతృప్తితో ఉన్న కీలక నేతలను గుర్తించి, వారికి భవిష్యత్తుపై హామీ ఇస్తూ పార్టీలోకి లాగేందుకు స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

**డబుల్ ఇంజన్ వ్యూహం వర్కౌట్ అవుతుందా?**

గతంలో లాగా కాకుండా ఈసారి చేరికల ప్రక్రియను నేరుగా కేంద్ర నాయకత్వమే పర్యవేక్షిస్తోంది. తెలంగాణకు చెందిన కీలక కేంద్ర మంత్రులు ఈ వలసల పర్వంలో తెరవెనుక చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఒకవైపు సంస్థాగత బలోపేతం, మరోవైపు రాజకీయ వలసలు.. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ వెళ్లడమే బీజేపీ ప్రస్తుత వ్యూహం. అయితే పరాయి పార్టీల నుండి వచ్చే నేతలకు ప్రాధాన్యత ఇస్తే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న పాత కాపులు, ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న నేతలు తిరుగుబాటు చేసే ప్రమాదం కూడా ఉంది. ఈ అంతర్గత అసంతృప్తిని చల్లార్చుకుంటూ, వలస వచ్చే నేతల ప్రజాబలాన్ని పార్టీకి ఎలా అనుకూలంగా మార్చుకుంటారనే దానిపైనే తెలంగాణలో బీజేపీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మొత్తానికి, అటు సంస్థాగత నెట్‌వర్క్‌ను వాడుకుంటూనే, ఇటు వలసల గేట్లు ఎత్తి తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త కుదుపు సృష్టించడానికి కమలదళం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

# మత్స్యకారుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**కోహెడ, జూలై 10, సిరిన్యూస్ :**

మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్లతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్య కారులకు శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజుల సంక్షేమం కోసం పాటుపడతానని, ముదిరాజుల అభివృద్ధి కోసం మంత్రి, ఎమ్మెల్యే పదవికే కాదు.. ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధం అని శ్రీహరి అన్నారు. తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో చారిత్రక ఘట్టంగా నిలిచే కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం శంకుస్థాపనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఇలాంటి ఆధునిక ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కావడం తెలంగాణకు గర్వకారణమని చెప్పారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారికి శాశ్వత ఉపాధి కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లకు అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు.

**మంచినీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానం**

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో సుమారు రూ.47 కోట్లతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2025లో రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల టన్నుల చేపలు, 15 వేల టన్నుల మంచినీటి రొయ్యల ఉత్పత్తి నమోదైంది. ఈ ఎగుమతుల కేంద్రం అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు లభించి మత్స్యకారులకు మెరుగైన ధరలు అందనున్నాయి. తెలంగాణ చేపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు దక్కనుంది. ఈ కేంద్రంలో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణ కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. సుమారు రెండు వేల మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకేజింగ్, రవాణా తదితర రంగాల్లో సుమారు ఐదు వేలమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది చేపల మార్కెట్ మాత్రమే కాక రాష్ట్ర మత్స్య రంగాన్ని ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం చేసే అభివృద్ధి వేదికగా నిలవనుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ప్రతి చేపకు ప్రపంచ మార్కెట్ అందించడమే తమ లక్ష్యం.. మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక సంతోషం నింపడమే ప్రభుత్వ సంకల్పం' అని ప్రభుత్వం పేర్కొంది. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు షరతులతో బెయిల్

- చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి విడుదల
- దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం
- సాక్షులను ప్రభావితం చేయొద్దని స్పష్టీకరణ

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్**

"పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నాం. దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలి. అవసరమైనప్పుడు విచారణ అధికారుల ఎదుట హాజరుకావాలి. సాక్షులు, ఫిర్యాదుదారులను ఎలాంటి ప్రభావానికి గురిచేయరాదు" అని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం బండి భగీరథ్ చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి విడుదల య్యారు. బెయిల్ ఉత్తర్వుల ప్రతులు జైలు అధికారులకు అందిన అనంతరం అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసి ఆయనను విడుదల చేశారు.భగీరథ్ విడుదల సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు చర్లపల్లి కేంద్ర కారాగారం వద్దకు చేరుకుని ఆయనకు స్వాగతం పలికారు. విడుదల అనంతరం వారు కొద్దిసేపు భగీరథ్‌తో మాట్లాడారు. బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు పలు షరతులు విధించింది. కేసు దర్యాప్తులో విచారణ అధికారులకు పూర్తిగా సహకరించాలని, అవసరమైనప్పుడు వారి ఎదుట తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. అలాగే కేసులోని సాక్షులు, ఫిర్యాదుదారులను ఎలాంటి ప్రభావానికి గురిచేయరాదని స్పష్టం చేసింది. కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో హైకోర్టు విధించిన అన్ని షరతులను తప్పనిసరిగా పాటించాలని న్యాయస్థానం పేర్కొంది. షరతుల ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. కేసు తదుపరి విచారణ సంబంధిత న్యాయస్థానంలో కొనసాగనుంది.



# పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

- పరిశ్రమల శాఖ అధికారులకు సీఎస్ సంజయ్ ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్:**
రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై పరిశ్రమలు, వాణిజ్య శాఖ సీనియర్ అధికారులతో సచివాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణంగా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయాలని, తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడానికి వీలు కలుగుతుందని అన్నారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతోపాటు ఇతర వ్యూహాత్మక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, అభివృద్ధి చేస్తున్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలు, పూర్తి చేయాల్సిన గడువులపై సీఎస్‌కు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సీఎస్ ఆదేశించారు. అలాగే కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే అవరోధాలను ముందుగానే గుర్తించి, శాఖల మధ్య సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం ప్రారంభించారు. కొండాపూర్‌లోని క్రిషే ఎమరాల్డ్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ నూతన కేంద్రం అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ డిజైన్, హైస్పీడ్ కనెక్టివిటీ, నెక్స్ట్ జనరేషన్ ఏఐ సిస్టమ్ డెవలప్‌మెంట్‌కు కీలక ఇంజనీరింగ్ హబ్‌గా సేవలందించనుంది. కార్యక్రమంలో కందూ ఏఐ సీఈఓ, కోఫౌండర్ సృజన్ లింగతో పాటు సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, ఉద్యోగులు, భాగస్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రపంచ స్థాయి సెమీకండక్టర్, డీప్‌టెక్, ఏఐ రంగాలకు విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన దూరదృష్టి విధానాల ఫలితమని అన్నారు. ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, అత్యుత్తమ మౌలిక సదుపాయాల కారణంగానే ప్రపంచ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణకు ఎంచుకుంటున్నాయని పేర్కొన్నారు కందూ ఏఐ తన ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం నగర ప్రతిష్ఠను మరింత పెంచుతుందన్నారు. ఈ సంస్థ ద్వారా అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు, సెమీకండక్టర్ పరిశ్రమలో మరిన్ని పెట్టుబడులు తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



కందూ ఏఐ సీఈఓ, కోఫౌండర్ సృజన్ లింగ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ ఇంజనీరింగ్ ప్రతిభకు హైదరాబాద్ అత్యుత్తమ కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు. సంస్థ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో స్థానిక ప్రతిభను మరింత ప్రోత్సహిస్తూ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ కేంద్రంలో చిప్ డిజైన్, వెరిఫికేషన్, వాలిడేషన్, ఫర్మ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సిస్టమ్స్ ఇంజనీరింగ్, కస్టమర్ సపోర్ట్ వంటి కీలక విభాగాలు పనిచేయనున్నాయి. దీంతో కందూ ఏఐ గ్లోబల్ ఇంజనీరింగ్ నెట్‌వర్క్ మరింత బలోపేతం కావడంతోపాటు హైదరాబాద్ అంతర్జాతీయ సెమీకండక్టర్ హబ్‌గా తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది.

# పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా?

**హైదరాబాద్, జూలై 10, సిరిన్యూస్:**
భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన ప్రమాణం ఏమైంది? రాష్ట్రం సంగతి పక్కన పెడదాం... కనీసం నువ్వు సభ పెట్టిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా? సమాధానం చెప్పగలవా? ఒకవైపు "చివరి ఏడాదిలో రాజకీయాలు చేద్దాం" అంటూ.. మరోవైపు ప్రతి బహిరంగ సభలో ఎందుకంత ఆవేశంతో, అసహనంతో రగిలిపోతున్నావంటూ రేవంత్‌రెడ్డిని హరీష్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కన్నెపల్లి నుండి నీళ్ళు లిఫ్ట్ చేయని నీ చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేసుకోవాలని చూడటం హీనమైన చర్య.28 లక్షల వరద వచ్చినప్పుడే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు చెక్కు చెదరలేదు. లక్ష క్యూసెక్కుల వరద వస్తున్న ప్రస్తుత సమయంలో ఏదో జరుగుతుందని ఎందుకు భ్రమలు కల్పిస్తున్నారు.కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లను లిఫ్ట్ చేసి అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి తరలించాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు?రిటైర్డ్ ఇంజనీర్ల సుదీర్ఘ అనుభవం అంటే మీకు లెక్కే లేదా?ఆనాటి రోజులు తెస్తానన్న రేవంత్ రెడ్డి.. మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి తెలంగాణ జలాల దోపిడీకి తలుపులు తెరిచిన పరిస్థితి తీసుకురావడం దుర్మార్గం.తెలంగాణ జలాలను తన గురువు చంద్రబాబుకు కప్పం కడుతున్నట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి.నీళ్లు ఉండి కూడా ఎత్తిపోకుండా, రిజర్వాయర్లు నింపకుండా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి తెలంగాణకు శాపంగా, ఆంధ్రప్రదేశ్‌కు వరంగా మారింది. ఒక వైపు ఎల్ నినో ప్రభావం ఉన్నా తెలంగాణలో గోదావరి జలాలు గలగలా ప్రవహిస్తున్నాయి. అయినా ఆ నీటిని ఒడిసిపట్టకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెడుతున్న రేవంత్ సర్కారు తెలంగాణకు జలద్రోహం చేస్తోంది.ఎల్‌నినో కరువు హెచ్చరికలు, రిటైర్డ్ ఇంజనీర్ల సూచనలు పక్కన బెట్టి నీటిని ఎత్తిపోసే చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట.కన్నెపల్లి పంప్ హౌజ్ వద్ద లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా పంపులు ఆన్ చేయకుండా నీటిని దిగువకు వదిలేయడం తెలంగాణ రైతాంగానికి రేవంత్ చేస్తున్న నమ్మక ద్రోహం. ఇది రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ అసలు వైఖరికి నిదర్శనం.రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉన్న పంపులు సిద్ధంగా ఉన్నా కావాలనే ఆన్ చేయకపోవడం క్షమించరాని నిర్లక్ష్యం.నీళ్లు ఉండి కూడా వాడుకోకపోవడం కంటే పెద్ద వైఫల్యం ఇంకేముంటుంది?తెలంగాణ ప్రభుత్వం నీటిని వదిలేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తమపట్నం, పుష్కర ఎత్తిపోతల ద్వారా రోజుకు 3 టీఎంసీల చొప్పున ఇప్పటికే 60 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకుంది.తెలంగాణ ప్రభుత్వం మాత్రం చేతులెత్తేసి చోద్యం చూస్తున్నది.నిరంతరాయంగా పట్టిసీమ పంపులు పనిచేస్తూ మొత్తం 24 మోటార్లను ఫుల్ రన్‌లో ఉంచి గోదావరి జలాలను ఏపీ కృష్ణా డెల్టాకు తరలిస్తుంటే, మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మాత్రం పంపులు ఆన్ చేయకుండా చేతులు ముడుచుకుని కూర్చోవడం సిగ్గుచేటు.ఒక్కో పట్టిసీమ మోటారు 4 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తూ నీటిని ఎత్తిపోస్తుంటే, తెలంగాణలో సిద్ధంగా ఉన్న బాహుబలి పంపులను నడపకపోవడం వెనుక దాగి ఉన్న చీకటి ఒప్పందం ఏమిటి?కళ్ల ముందే నీరు ఏపీకి తరలివెళ్తున్నా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చేతులు ముడుచుకుని కూర్చొంటున్నది?తెలంగాణ రైతులకు ఉపయోగపడాల్సిన నీళ్లు ఏపీకి తరలిపోతుంటే సీఎం, నీళ్ల మంత్రి ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నట్లు?గురుదక్షిణ చెల్లింపులో భాగంగానే కన్నెపల్లి పంపులను ఆన్ చేయకుండా తెలంగాణ జలాలను ఏపీకి వదులుతున్నారా? దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలి?ఎల్లంపల్లి ప్రాజెక్టులో 20.18 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 5.48 టీఎంసీలే నిల్వ ఉంది. డెడ్ స్టోరేజీ 3.32 టీఎంసీల స్థాయికి చేరువలో ఉన్నా ప్రభుత్వం అప్రమత్తం కావడం లేదు. ఇది బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. ఎల్లంపల్లి స్టేజ్ 1 & 2 ఆయకట్టుకు 12 టీఎంసీ, కడెం లిఫ్ట్ స్కీమ్ కోసం 3 టీఎంసీ, మంథని, రామగుండం సాగునీటి అవసరాల కోసం 2టీఎంసీ, రామగుండం ఎన్‌టీటీపీ కోసం 6.50 టీఎంసీ, ఎన్‌టీపీసీ కోసం 4.73 టీఎంసీ మొత్తంగా విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల అవసరం కోసం 13.67 టీఎంసీ, తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ కోసం 6.57 టీఎంసీ, హైదరాబాద్ తాగునీటి సరఫరా కోసం 10 టీఎంసీ కేటాయింపులు ఉన్నాయి.
డెడ్ స్టోరేజీకి చేరిన నీటి నిల్వతో ఈ అవసరాలను ప్రభుత్వం ఎలా తీర్చుతుంది? హైదరాబాద్‌కు తాగునీటి సమస్య ఏర్పడితే దానికి బాధ్యులు ఎవరు? ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు ఏం చేస్తున్నట్లు? ప్రమాద ఘంటికలు మోగుతున్నా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యం. ప్రజల అవసరాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎగువ గోదావరిలో కొద్దిపాటి వరదలు కూడా రాలేదు. ఎస్సారెస్పీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో కూడా ప్రవాహాలు ఆశించిన స్థాయిలో లేవు. ఎగువ గోదావరిలో ఇలాంటి లోటు ప్రవాహాలు ఉన్న కరువు కాలంలో దిగువ గోదావరిలో లక్ష క్యూసెక్కుల నీరు వృథా గా కిందకు వెళ్ళిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో దిగువ గోదావరిలో లభ్యమవుతున్న నీటిని ఒడిసి పట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత. గోదావరిలో వరద లేదని, వానలు లేవని ప్రభుత్వం చెబుతోంది. మరి పట్టిసీమలో 24 మోటార్లు నిరంతరాయంగా ఎలా నడుస్తున్నాయి? గోదావరిలో వరద లేకపోతే పట్టిసీమకు నీరు ఎక్కడి నుంచి వస్తోంది రేవంత్ రెడ్డి?మేడిగడ్డ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతోంది.

# నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

- ప్రజా ప్రయోజనాలకి నిధులు ఉపయోగించాలి
- గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**నర్సాపూర్ జూలై 10 (సిరి న్యూస్)**




ప్రభుత్వ పథకాలు నిధులు వంటి అంశాలపై వి బీ జి రామ్ జి , ఓ ఎస్ ర్, యస్ డబ్లు యం నియమాలు, 15, 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు, ఇతర అంశాలపై నర్సాపూర్, తూప్రాన్ డివిజన్ల లోని 248 గ్రామ పంచాయతీల సర్పంచులు,కార్యదర్శులతో ఒక రోజు శిక్షణా అవగాహన సమావేశం బివిఆర్ఐటి కళాశాలలో శుక్రవారం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ నగేష్ హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు.
గ్రామ పంచాయతీ నిధులను ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని, నిధుల దుర్వినియోగం, మళ్లింపు జరిగితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు గ్రామ పంచాయతీలకు లభించే 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, వి బి జి రామ్ జీ పథకం తదితర వనరులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని గ్రామాల్లో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను పరిష్కరించి జంతు పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పశు వైద్య శాఖ ద్వారా శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని, గ్రామ పంచాయతీలు కుక్కలను పట్టుకోవడం, సంరక్షణ వంటి అంశాలపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. విబి జి రామ్ జీ పథకాల క్రింద చేపట్టిన పనులకు చెల్లింపులు నిర్ణీత గడువులో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని . ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, మహిళా సంఘాల భవనాలు, ఇతర ప్రాధాన్యత కలిగిన మౌలిక వసతులు కల్పించాలని భూమి, పరిపాలనా అనుమతులు జిల్లా యంత్రాంగం నుంచి అందజేస్తామని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు కూరగాయల సాగు కోసం పందిళ్ల ఏర్పాటు, బీటీ రహదారులు, మ్యాజిక్ డ్రైన్లు, సౌర విద్యుత్ ఆధారిత వీధి దీపాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఉండాలి అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య డిఎల్పిఓ తూప్రాన్ డి ఎల్ పి ఓ నర్సాపూర్ తూప్రాన్ మండలాల ఎంపీడీవోలు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు

# వైటీపీఎస్ టెండర్ల గడువు పెంపు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో కోల్, యాష్ హ్యాండ్లింగ్ పనులను ప్రైవేటుకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. సంస్థకు భారీగా నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ పవర్ జాక్ నేతలు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో, ప్రభుత్వం టెండర్ల గడువును మళ్లీ పొడిగించింది. వైటీపీఎస్ నిర్వహణను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఇప్పటికే పలుమార్లు ధర్నాలు చేశాయి. అయితే, ప్రభుత్వం మొండిగా టెండర్లు పిలవడంతో ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే పలుమార్లు పొడిగించిన టెండర్ గడువును, ఈసారి ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కేవలం మూడు కంపెనీలు మాత్రమే టెండర్లు వేయడం, ఉద్యోగుల నుంచి పెరుగుతున్న వ్యతిరేకత ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది.

**60 కోట్లు మిగులుతున్నపుడు ప్రయివేటుకు ఎందుకు?**

ఈ పనులను ప్రైవేటుకు అప్పగిస్తే రూ. 225 కోట్ల భారం పడుతుందని, అదే పనిని తమ ఉద్యోగులతో చేయిస్తే రూ. 60 కోట్లు తక్కువ ఖర్చుతోనే పూర్తి చేయవచ్చని జెన్కో ఇంజినీర్లు ఇప్పటికే యాజమాన్యానికి లెక్కలతో సహా వివరించారు. అయినప్పటికీ, ప్రభుత్వం ఎందుకు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతోందని ఉద్యోగ సంఘాలు నిలదీస్తున్నాయి. డబ్బులు దండుకోవడానికే సంస్థకు నష్టం కలిగించేలా ప్రైవేటు భాగస్వామ్యంపై ప్రభుత్వం పట్టుబడుతోందని ఆరోపిస్తున్నాయి. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన జాక్ నేతలు, నిర్వహణ వ్యయం ఎలా తగ్గించవచ్చో వివరించారు. కానీ, ఇంధన శాఖలోని సీనియర్ ఐఏఎస్ అధికారుల ఒంటెద్దు పోకడల వల్లే సమస్య పరిష్కారం కావడం లేదని నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి పట్టుదల వీడి, జెన్కో ద్వారానే నేరుగా పనులు చేయిస్తే ప్రభుత్వానికి పేరుతో పాటు రూ. 60 కోట్ల ప్రజా ధనం ఆదా అవుతుందని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొండిగా వెళ్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని పవర్ జాక్ నేతలు హెచ్చరించారు.



# పెండింగ్ పనుల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్, జూలై 10 (సిరి న్యూస్):**
టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలని సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అన్ని సర్కిళ్ల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్ష చేపట్టారు. విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎండీ స్పష్టం చేశారు. ప్రతి నెల 15వ తేదీలోగా డిలిస్ట్ బకాయిలపై వంద శాతం చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు బకాయిలపై అవగాహన కల్పించి వసూళ్లను మెరుగుపరచాలని ఆదేశించారు. హెచ్‌టీపీసీడీ, ఎల్‌టీపీసీడీ డిపాజిట్ల వసూళ్లు, ప్రభుత్వ బిల్లింగ్ సవరణలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సంస్థను 'జీరో డెత్ ఆర్గనైజేషన్'గా మార్చడమే లక్ష్యమని సీఎండీ పునరుద్ఘాటించారు. జూలై 10 నుంచి 20 వరకు చేపట్టే 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ వాక్ అలోంగ్ ది లైన్'ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బంది విధి నిర్వహణలో భద్రతా పరికరాలను ఖచ్చితంగా ధరించాలని, దెబ్బతిన్న స్తంభాలు, లైన్లను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రతి సర్కిల్‌లో కనీసం ఒక సబ్‌స్టేషన్‌ను 'మిడ్జిల్ మోడల్ సబ్‌స్టేషన్'గా అభివృద్ధి చేయాలని, అంగన్‌వాడీల విద్యుదీకరణను జూలై నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నెట్‌వర్క్ జీఐఎస్ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం జోనల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి శనివారం ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అంతరాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలని సీఎండీ తెలిపారు. నెట్‌వర్క్ విస్తరణ అవసరం లేని కొత్త విద్యుత్ కనెక్షన్లను రెండు రోజుల్లోనే విడుదల చేయాలని, ఆన్‌లైన్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు, డీఈలు, ఏఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

- హరీష్ రావు అసమర్థుడని ఆనాడే గుర్తించిన కెసిఆర్
- హుజూర్ నగర్ లో మోడల్ కాలనీకి మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన



**నల్లగొండ, జూలై 10 సిరిన్యూస్:**
కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణం కేవలం బీఆర్ఎస్ పార్టీయేనని మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కువ మొత్తం ఖర్చు పెడితే ఎక్కువ కమీషన్ వస్తుందనే దురాశతోనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి కాళేశ్వరం అని పేరు మార్చారని ఆరోపించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా నువ్వు పనికిరావని మామే నిన్ను పదవి నుంచి తీసివేసి సర్టిఫికెట్ ఇచ్చాడు క దా అంటూ ఎద్దేవా చేశారు. రూ.38కోట్లతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు చేపట్టి కనీసం పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్లో రూ. 20 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ అ వృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన బీఆర్ఎస్ నేతలపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్‌రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు కవిత ఆన్ రికార్డ్ చెప్పిన 1400 కోట్ల కమిషన్ వ్యవహారాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కనీసం మట్టి పరీక్షలు కూడా నిర్వహించకుండా, అధికారులు సూచించిన చోట కాకుండా ఐదు కిలోటర్ల దూరంలో, ఇసుకపై పునాది వేయడం వల్లే ప్రాజెక్టు కూలిపోతుందని సేఫ్టీ కంట్రోల్ ముందే హెచ్చరించినా బీఆర్ఎస్ వినలేదని ఉత్తమ్ మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ టీమ్ హెచ్చరించినా పట్టించుకోకుండా.. ఇప్పుడు కాంగ్రెస్పై నిందలు వేయడం సరికాదన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు నీటిని నిల్వ చేయొద్దని చెబుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఇంకా మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటకు వస్తున్న నీళ్లు ఎస్సారెస్పీ స్టేజ్ 2 ద్వారా వస్తున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా కాళేశ్వరం నీళ్లు వదల్లేదని స్పష్టం చేశారు. తెలంగాణను అప్పులమయం చేసిన బీఆర్ఎస్ తప్పులను సరిదిద్దుతూ.. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# అంగన్వాడీ టీచర్, ఆయా పోస్ట్ లకు దరఖాస్తు ఆహ్వానం

## నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలో 79 పోస్టులు

**నర్సాపూర్ జూలై 11 (సిరి న్యూస్ )**

అంగన్వాడి టీచర్లు ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ హేమ భార్గవి వెల్లడించారు ఆమె మాట్లాడుతూ నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 23 అంగన్వాడి టీచర్లు 56 అంగన్వాడీ ఆయాల భర్తీకి అర్హులైన స్థానికంగా ఉంటున్న మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 10 నుండి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు అర్హతలు ఇతర నియమ నిబంధనల కొరకు http://wdcw.tg.nic.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు పూర్తి వివరాల కొరకు నర్సాపూర్ ఐసిడిఎస్ సిడిపిఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# గణితంతో క్లిష్ట సమస్యలకు సులభ పరిష్కారాలు..

## గీతం ఆతిథ్య ఉపన్యాసంలో ఐఐటీ బాంబే ప్రొఫెసర్ శివాజీ గణేష్



**పటాన్ చెరు, జూలై 10 (సిరి న్యూస్):**

గణిత శాస్త్రంలోని సరైన విధానాలను అనుసరిస్తే క్లిష్టంగా కనిపించే సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనవచ్చని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బాంబే ప్రొఫెసర్ డాక్టర్ శివాజీ గణేష్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన "పాక్షిక అవకలన సమీకరణాలు (పీడీఈలు), వైవిధ్య విశ్లేషణ" అంశంపై ప్రసంగించారు. స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో "ఒక ఆలోచన–మూడు సమస్యలు–ఒక పద్ధతి" అనే సూత్రం ద్వారా విభిన్న గణిత సమస్యలను ఒకే విధానంతో పరిష్కరించవచ్చని వివరించారు. గణిత శాస్త్రంలో పరిశోధన, సమస్యల పరిష్కారంలో ప్రత్యక్ష పద్ధతుల ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ మోతెహర్ రెజా ప్రొఫెసర్ శివాజీ గణేష్‌ను సత్కరించారు. గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్, ప్రొఫెసర్ బి.ఎం. నాయుడు, డాక్టర్ శివారెడ్డి శేరిల పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి సమన్వయం చేశారు.

# స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం




**తూప్రాన్ జులై 10 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డులో శుక్రవారం స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం లో భాగంగా వార్డులోని ప్రజలకు మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ తడి పొడి చెత్త కార్యక్రమాలపై అవగాహన కల్పించి ఇంటి లోనే చెత్తను ఎలా వేరుచేయాలో మున్సిపల్ సిబ్బంది చేత ప్రజలకు అవగాహన కల్పించారు తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో తడి పొడి చెత్త వేరు చేసిన తరువాత నే చెత్త సేకరణ వాహనాల లో వెయ్యాలని చెత్త వేరు చేయడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు తూప్రాన్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేలా ప్రజలు సహకరించాలని వార్డు ప్రజలకు చెత్తను వేరు చేయడానికి చెత్త బుట్టలను పంపిణి చేసిన మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ప్రతి వార్డులో చెత్త బుట్టల పంపిణి కార్యక్రమం ఉంటుందని చెప్పారు ఈ కార్యక్రమం లో రవి శంకర్ రెడ్డి కౌన్సిలర్లు సత్య లింగం చెలిమెల రాములు జైపాల్ రాథోడ్ ప్రజలు మున్సిపల్ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు

# కౌన్సిలర్ చెక్కుల పంపిణీ

**తూప్రాన్ జులై 10 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు హైదర్ గూడ కు చెందిన గంగాధర్ లవణ్య కు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిది నుండి మంజూరైన 60 వేల రూపాయల చెక్కును 12వ వార్డు కౌన్సిలర్ స్వప్న నాగరాజు గౌడ్ అందించారు తూప్రాన్ టౌన్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ నాయకుడు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్య వైద్యం ఉపాధి పనులు రోడ్లు తాగు సాగు నీరు విద్యుత్ సరఫరా గ్రామీణా ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని విద్యా సంస్థలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల మెరుగుపడ్డాయని రైతులు మహిళలు యువత కోసం వివిధ సంక్షేమ ఉపాధి పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు

# ఓటరు ధ్రువీకరణ ఫారంపై జిల్లావ్యాప్తంగా అయోమయం

- "ఫారం తప్పుగా నింపితే ఓటు ఉంటుందో... పోతుందో " అనే ఆందోళనలో ప్రజలు
- జూలై 24లోపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండటంతో గ్రామాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**మెదక్ జులై 10 సిరి న్యూస్**

జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఓటరు ధ్రువీకరణ (వెరిఫికేషన్) ప్రక్రియలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ప్రతి ఓటరు ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన ధ్రువీకరణ ఫారాన్ని నింపాల్సి ఉండగా, ఫారంలోని వివరాలు సాధారణ ప్రజలకు సులభంగా అర్థం కాకపోవడం వల్ల అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు, దినసరి కూలీలు, చదువు లేని గ్రామీణ ప్రజలు ఈ ఫారాన్ని ఎలా నింపాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఫారంలో 2002కు ముందు ఓటరుగా నమోదైనవారికి ఒక విభాగం, 2002 తర్వాత నమోదైనవారికి మరో విభాగం, అలాగే వ్యక్తిగత వివరాలకు ప్రత్యేక భాగం ఉండటంతో ఏ కాలమ్‌లో ఏ వివరాలు నమోదు చేయాలో చాలామందికి స్పష్టత లేదు. దీంతో గ్రామాల్లో ఒకరి వద్దకు మరొకరు వెళ్లి అడుగుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లను ఆశ్రయిస్తూ సమాధానాల కోసం తిరుగుతున్నారు. ఇదే సమయంలో ప్రజల్లో మరో ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. "ఫారం సరిగా నింపకపోతే మా ఓటు ఉంటుందా పోతుందా అనే సందేహంతో చాలా మంది భయాందోళనలకు గురవుతున్నారని గ్రామాల్లో చర్చ జరుగుతోంది. అధికారికంగా అలాంటి నిర్ణయం ప్రకటించబడకపోయినా, సరైన అవగాహన లేకపోవడంతో ప్రజల్లో అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అందుకే ఎన్నికల యంత్రాంగం ఈ విషయంలో మరింత స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరుతున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందిస్తున్నప్పటికీ, ప్రతి కుటుంబానికి పూర్తి వివరాలు చెప్పేందుకు సమయం సరిపోవడం లేదని తెలుస్తోంది. ఒక్కో బీఎల్‌వో పరిధిలో వందలాది ఓటర్లు ఉండటంతో ప్రతి ఒక్కరికి విడిగా ఫారం నింపించే పరిస్థితి కనిపించడం లేదని గ్రామస్తులు అంటున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో నిరక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఫారాలు నింపడం మరింత క్లిష్టంగా మారింది. కుటుంబ సభ్యుల వివరాలు, పాత ఓటరు నమోదు సమాచారం, అవసరమైన పత్రాలు, నమోదు సంవత్సరం వంటి అంశాలపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ




నేపథ్యంలో గ్రామాల్లోని డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులను స్వచ్ఛంద సేవకులుగా వినియోగించుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ స్థాయి సిబ్బంది సహకారంతో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం, పాఠశాల లేదా గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడే ఫారాలు పరిశీలించి నింపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో తప్పులు తగ్గడంతో పాటు బీఎల్‌వోలపై పని భారం కూడా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, ఈ నెల 24వ తేదీలోపు ఫారాలు సమర్పించాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి గ్రామంలో కనీసం ఒకటి లేదా రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ప్రజల సమక్షంలో ఫారాలు నింపే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. మైక్ ప్రకటనలు, గ్రామ సభలు, అవగాహన సమావేశాలు, కరపత్రాలు, వీడియోల ద్వారా ఫారం ఎలా నింపాలి, ఎవరు ఏ విభాగం నింపాలి, ఎలాంటి పత్రాలు జత చేయాలి వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని ప్రజలు సూచిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, నిరక్షరాస్యులకు ఇంటి వద్దే సహాయం అందించేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తే ప్రక్రియ మరింత సులభంగా పూర్తవుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అందువల్ల ప్రతి అర్హుడైన ఓటరు ఎలాంటి అయోమయం లేకుండా ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం, ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, జూలై 24 గడువులోపు ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన ధ్రువీకరణ ఫారం నింపే అవకాశం కల్పించాలని జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మెదక్ పట్టణంలో.. బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట

- రూ.50లక్షలతో బ్రాహ్మణ సదనం
- శంకుస్థాపనలో పాల్గొన్న
- మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు .

**మెదక్, జూలై 10 (సిరి న్యూస్)**





బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా విప్రహిత బ్రాహ్మణ సదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.బ్రాహ్మణ సంఘం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మైనంపల్లి హనుమంతరావుకు బ్రాహ్మణోత్తములు పూర్ణకుంభంతో సాదరంగా స్వాగతం పలికారు. సమాజంలోని పేదలకు ఉచిత కళ్యాణ మంటపముతో పాటు నిత్యం అన్నదానం చేపట్టడం ముఖ్య ఉద్దేశంగా ఈ భవనాన్ని చేపడుతున్నామన్నారు.భవనంలో సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియపరిచేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి గ్రంథాలయంను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.వేద సభలు, పురాణ కాలక్షేపం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ భవనం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్,బొజ్జ పవన్ శర్మ,దేశాయిపేట నాగరాజు శర్మ,శంభుని సాయి శర్మ , మూలా అశోక్,బ్రాహ్మణ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు సలక రాజేశ్వర్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకర్ శర్మ ,మెదక్ జిల్లా కార్యదర్శి కాశీనాథ్ రావు, కోశాధికారి హరిప్రసాద్, మాజీ జిల్లా కోశాధికారి డి.జి. శ్రీనివాస శర్మ, డివిజన్ అధ్యక్షులు దేశాయిపేట లింగమూర్తి శర్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి వైద్య శ్రీనివాస్ శర్మ ,మిట్టపల్లి ప్రసాద్, రావి కోటి పండిట్రావు, శ్రీవాండ్ల సాయిబాబా,రాయరావు నరసింహారావు, భాష్యం మధుసూదనాచారి , వైద్య రాజు, రవి, జనమరాజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రొటోకాల్ పాటించని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.

**కొంపల్లి.జులై.10(సిరి న్యూస్).**



అధికారం తమది ఉందనే హహంతో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్రొటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్న దుస్థితి దులపల్లి డివిజన్ లో వెలుగులోకి వచ్చింది,దీనిపై ప్రతిపక్ష బి.ఆర్.ఎస్.పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ చింతల దేవేందర్ గురువారం నాడు తన కార్యాలయంలో అక్కడి నాయకులతో కలిసి విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ.అధికారం తమది ఉందనే అహంకారంతో అధికారులను లెక్క చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూన్నా కాంగ్రెస్ పార్టీ నాయకులపై మండిపడ్డారు.దూలపల్లి నుంచి ఇండస్ట్రియల్ వరకు నిర్మించనున్న రహదారి పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో సంబంధిత అధికారులు రహదారి మార్గాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ శాఖ డీఈ,ఏఈ,టౌన్ ప్లానింగ్ అధికారులు,ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా రోడ్డు పనుల అమలు, ట్రాఫిక్ నియంత్రణ, పనుల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు.అలాగే రోడ్డు పక్కన ఉన్న అవరోధాలను తొలగించి పనులు సజావుగా చేపట్టే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ అధికారిక పరిశీలనలో ఫ్రొటోకాల్‌ను పాటించకుండా కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రచారం చేసుకోవడంపై టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రభుత్వ అధికారుల కార్యక్రమాన్ని రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చడం తగదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులను పక్కనపెట్టి ఫ్రొటోకాల్‌ను ఉల్లంఘించడం సరికాదని పేర్కొన్నారు.రహదారి అభివృద్ధి పనులు ప్రజల ప్రయోజనాల కోసం జరుగుతున్నాయని వాటిని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవద్దని టీఆర్ఎస్ నాయకులు సూచించారు.భవిష్యత్తులో అధికారిక కార్యక్రమాల్లో ఫ్రొటోకాల్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మాజీ వైస్ చెర్మన్ గాంగ్య నాయక్.మాజీ కౌన్సిలర్ డప్పు కిరణ్.యువ నాయకులు రఘు.డైరెక్టర్ మధుసూదన్.మాజీ వార్డు సభ్యులు యాద గిరి. పెంట య్య. త దిత రులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను జూలై 24లోపు పూర్తి చేయాలి..

## అధికారులకు అడిషనల్ కలెక్టర్ ఆదేశం

**పటాన్‌చెరు, జూలై 10 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ పురోగతిపై సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శుక్రవారం సహాయ ఓటరు నమోదు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌ఓలు వెంటనే స్వీకరించి, వాటి డిజిటైజేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయడానికి జూలై 24, 2026 చివరి తేదీ కావడంతో, ఆ గడువులోగా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌పై విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు, రాజకీయ పార్టీల బీఎల్ఏల సహకారాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. హెల్ప్ సెంటర్ల ద్వారా ఓటర్లకు ఫారాలు నింపడంలో అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పటాన్‌చెరు నియోజకవర్గ తహసీల్దార్లు, పటాన్‌చెరు (సర్కిల్–46), అమీన్‌పూర్ (సర్కిల్–47) డిప్యూటీ కమిషనర్లు, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలకు వన్నె తెచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహకం

### కట్లె సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్



**వెల్దుర్తి, జులై 10, (సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండల కేంద్రం లో గల పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత సంవత్సరం విద్యనభ్యసించి పదవ తరగతి పరీక్షల్లో మండల టాపర్లుగా ఎంపికైన, అక్షయ, మేఘన, లిప్సిక,లకు , సత్తయ్య మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ నరేందర్ శుక్రవారం రోజు జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ విచ్చేసి విద్యార్థులను సన్మానించి వారికి నగదు పురస్కారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు నగదు పురస్కారం ఇస్తున్నామని మనం చదువుకున్న పాఠశాలకు ఏదో కొంత సేవ సేవ చేయాలని దృక్పథంతో మా తండ్రి సత్తయ్య మెమోరియల్ ట్రస్టు★పేరున ఈ పురస్కారాలు అందిస్తున్నానని ఇంకా పాఠశాలకు ఏవైనా అవసరాలు ఉంటే కూడా అందిస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టాపర్లు గా ఎంపికైన ముగ్గురు విద్యార్థునిలు ఉపాధ్యాయుల గురించి మాట్లాడుతూ ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులకు అమూల్యమైన సందేశాలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలకు వన్నెతెచ్చిన విద్యార్థినిలను ప్రోత్సహించేందుకు ★కట్లే సత్తయ్య ట్రస్టు ( ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం శాలువలతో సత్కరించి,ఈ సహాయాన్ని ,గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్, ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ట్రస్టు కమిటీ సభ్యులు కలిసి విద్యార్థినిలకు అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్‌కు, కమిటీ సభ్యులకు, విద్యార్థినిల తల్లిదండ్రులు ,గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దర్యాప్తులో నాణ్యత.. బాధితులకు భరోసా

- **పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ఉండాలి**
- **ఎస్పీ పరితోష్ పంకజ్**
- **పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం**




**సంగారెడ్డి, జూలై 10 (సిరి న్యూస్):**

లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ నెలవారీ నేర సమీక్షా సమావేశం అత్యంత కీలక నిర్ణయాలతో ముగిసింది. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, దర్యాప్తులో వేగంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, మిస్సింగ్ మరియు నాన్-బెయిలబుల్ వారెంట్ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. దర్యాప్తులో సైంటిఫిక్ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, న్యాయపరమైన సందేహాల కోసం ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ ను ఆశ్రయించాలని సూచించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు గ్రామ స్థాయిలో 'విలేజ్ పోలీసు అధికారి' వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, మహిళల భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారిలో శాఖపై నమ్మకాన్ని పెంచాలని ఆయన స్పష్టం చేశారు. నేరాల నివారణలో సీసీ కెమెరాల పాత్ర కీలమని ఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, పెట్రోల్ బంకులు, ధాబాలు వంటి కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్‌హెచ్‌వోలకు సూచించారు.

**ఉత్తమ అధికారులకు రివార్డులు**

విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అనంతరం పోలీసు వాహనాల స్థితిగతులను పరిశీలించి, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు తక్షణమే అందుబాటులో ఉండాలని, ఎమర్జెన్సీ కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వాహనాలను పరిశుభ్రంగా ఉంచిన డ్రైవర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చెత్త ఎక్కడపడితే అక్కడ వేయరాదు

- **చెత్త వేయుటకు ప్రత్యేక చెత్త డబ్బాల ఏర్పాటు**
- **గ్రామ సర్పంచ్ రంగారెడ్డి**



**వెల్దుర్తి జులై 10,(సిరి న్యూస్)**

వెల్దుర్తి మండలం మెల్లూరు గ్రామంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ రంగారెడ్డి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఉండుటకు తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. చెత్త సేకరణకు నూతనంగా చెత్త డబ్బాలను డ్రమ్ముల ద్వారా తయారుచేసి గ్రామంలో పలు వీధుల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలలో వేయాలని కోరారు. అంతేకాకుండా గ్రామంలోని ప్రతి వీధిలో తిరుగుతూ గ్రామస్తులకు చెత్త పేరుకు పోతే వచ్చే వ్యాధుల గురించి సమస్యల గురించి తెలిపారు. ప్లాస్టిక్ ను కూడా పూర్తిగా నిషేధిద్దామని గ్రామస్తులకు ప్లాస్టిక్ వల్ల వచ్చే ఇబ్బందుల గురించి కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ నవీన్ రెడ్డి, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచాలి

- **రెండు రోజుల్లో 50 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలి**
- **అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




**సంగారెడ్డి, జూలై 10 (సిరి న్యూస్):**

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం, కలెక్టర్ స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలో అలసత్వం వహిస్తున్న ఏఈఆర్‌వోలపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో శని, ఆదివారాలు కూడా అధికారులు ప్రత్యేకంగా పనిచేసి, వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోని అధికారులపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి బీఎల్‌ఓకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించాలని, ఏఈఆర్‌వోలు మరియు ఈఆర్‌వోలు పోలింగ్ స్టేషన్ వారీగా ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లను సమన్వయం చేసుకుంటూ బీఎల్‌ఓలు వేగంగా పనిచేసేలా చూడాలని సూచించారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు వెంటనే బీఎల్‌ఓలకు అందించాలని కలెక్టర్ కోరారు. బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బీఎల్‌ఓలకు సహకారం అందించాలని, ఫారాల సేకరణలో సమన్వయం పాటించాలని సూచించారు. ఓటర్లు తమ ఫారాలను నింపడంలో ఇబ్బందులు పడకుండా సిబ్బంది తగిన సహాయం అందించాలని ఆదేశించారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం..

- **భర్త, ఇద్దరు చిన్నారులకు గాయాలు..**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పటాన్‌చెరు పోలీసులు**

**పటాన్‌చెరు, జూలై 10 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందగా, ఆమె భర్తతో పాటు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. రేగోడు మండలం కోత్వాన్‌పల్లి గ్రామానికి చెందిన వీరొల్ల గోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి స్కూటీపై హైదరాబాద్‌కు వెళ్తుండగా, మధ్యాహ్నం ఇస్నాపూర్ చౌరస్తా సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంకు వద్ద వెనుక నుంచి వచ్చిన మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ ట్రైలర్ లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న నలుగురూ రోడ్డుపై పడిపోగా, లారీ చక్రం ప్రవల్లిక (32)పై నుంచి వెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ప్రవల్లిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గోపాల్‌తో పాటు చిన్నారులు నక్షత్ర, ప్రిన్స్‌కు గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఎస్ఐ వినోద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, ప్రమాదానికి కారణమైన



లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆయిల్ పామ్ రైతులకు విజ్ఞానయాత్ర

- **ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన 22 మంది రైతులు**
- **గోద్రెజ్ ఆగ్రోవెట్ సహకారంతో శాస్త్రీయ సాగు పద్ధతులపై శిక్షణ**



**సంగారెడ్డి, జూలై 10 (సిరి న్యూస్):**

వ్యవసాయంలో భాగంగా రైతులు లాభదాయకమైన పంటల వైపు మళ్లాలనే లక్ష్యంతో, సంగారెడ్డి జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల రైతులకు విజ్ఞాన యాత్రను నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ ఆయిల్ పామ్ మిషన్ లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల నుండి ఎంపిక చేసిన 22 మంది రైతులను గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో ఖమ్మం జిల్లా, కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటలకు తీసుకెళ్లారు. అక్కడ రైతులు తోటల నిర్వహణ, మొక్కల పెంపకం, ఎరువులు మరియు నీటి యాజమాన్య పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పంట కోత, రవాణా, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పొందారు. ఈ పర్యటనలో భాగంగా, ఇప్పటికే ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులతో సందర్శకులు ముఖాముఖిగా మాట్లాడారు. పంట ద్వారా లభిస్తున్న ఆదాయం, ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలపై రైతులకు వివరించారు. ఈ చర్చలు కొత్తగా సాగు చేయాలనుకునే రైతుల్లో ఎంతో నమ్మకాన్ని కలిగించాయి. ఉద్యాన అధికారి కె. మౌనికా రెడ్డి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ పామ్ దీర్ఘకాలిక ఆదాయాన్ని ఇచ్చే వాణిజ్య పంట. ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఎన్నో ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందిస్తోంది. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని, శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ ఏజీఎం ఈశ్వర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం




- **రూ.9 కోట్ల అభివృద్ధి పనులకు మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమోదం**
- **ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యతతో అభివృద్ధి పనులు**
- **చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, జులై 10 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న రూ.9 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపర్చే లక్ష్యంతో డ్రైనేజీ నిర్మాణాలు, సీసీ రోడ్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా విస్తరణ, వీధిదీపాల ఏర్పాటు, ఇతర అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆయా వార్డుల ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి పనులను రూపొందించినట్లు తెలిపారు. ఏ ఒక్క వార్డుకూ అన్యాయం జరగకుండా సమాన ప్రాధాన్యతతో నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆమోదం పొందిన పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చైర్మన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాన్ని దశలవారీగా కల్పిస్తూ ఆదర్శ మున్సిపాలిటీగా గుమ్మడిదలను తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ, తహసీల్దార్ పరమేశం, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్, ఎంఈఓ పౌలిన, వార్డు కౌన్సిలర్లు పద్మ, రాధిక, గౌసియా, ప్రమీల, రమేష్, కుమార్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు కలమ్మ, భాస్కర్ రెడ్డి, ఫయాజ్ తో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**44 అభివృద్ధి పనులకు మున్సిపల్ సమావేశంలో ఆమోదం**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.9 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 44 అభివృద్ధి పనులకు మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదం తెలిపింది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను సమస్యల ప్రాధాన్యత ఆధారంగా దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, వీధిదీపాల ఏర్పాటు వంటి అత్యవసర పనులకు ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.

## బీజేపీ కార్యవర్గంలో కీలక తీర్మానాలు..

- రూ.13 లక్షల కోట్లపై బీజేపీ తీర్మానం..
- వికసిత్ భారత్‌కు కార్యవర్గం మద్దతు..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 10 (సిరి న్యూస్)



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల పాలన, తెలంగాణ అభివృద్ధి, రైతు సంక్షేమం, బొగ్గు గనులు, రహదారులు, రైల్వే అభివృద్ధిపై కీలక తీర్మానాలు ఆమోదించారు. జిల్లా అధ్యక్షుడు నాగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అధ్యక్షతన బెల్లంపల్లిలో జరిగిన సమావేశంలో దేశాభివృద్ధి లక్ష్యంగా "వికసిత్ భారత్" కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజకీయ తీర్మానం, ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనపై ప్రత్యేక తీర్మానం, రైతు మోర్చా ఆధ్వర్యంలో వ్యవసాయ తీర్మానం, బొగ్గు గనుల అభివృద్ధి తీర్మానం, రహదారులు, రైల్వేలకు సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో తెలంగాణకు రూ.13 లక్షల కోట్ల నిధులు అందించిందని, వాటితో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి ఓదెలు, ముఖ్య అతిథిగా రఘునాథ్ వేరెబెల్లి హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు పాల్గొని పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

## జిల్లా స్కూల్ క్రీడలకు సన్నాహాలు..

**జిల్లా స్కూల్ క్రీడలకు కార్యాచరణకు శ్రీకారం..**
**70 మంది వ్యాయామ విద్య ఉపాధ్యాయులతో కీలక సమీక్ష..**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 10 (సిరి న్యూస్)




జిల్లాలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం శుక్రవారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలోని జిల్లా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి, డిప్యూటీ కలెక్టర్ చంద్రయ్య హాజరై క్రీడల నిర్వహణ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి సత్తయ్య, భరత్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.డి. యాకూబ్ గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన స్కూల్ క్రీడా పోటీలను సమీక్షించి, 2026–27 విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న క్రీడా పోటీల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

## గంగపుత్రుల న్యాయ గర్జన..

- గంగపుత్రుల హక్కుల కోసం గళం..
- 986 మందికి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి..
- 90% రాయితీపై వాహనాలు..
- రూ.20 లక్షల బీమా అమలు..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 10 (సిరి న్యూస్)

జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం సమీపంలో గంగపుత్రులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నేన్నెల నరసయ్య, పట్టణ అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా గంగపుత్రుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. విద్య, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గంగపుత్రులు ఇప్పటికీ అత్యంత వెనుకబడిన వర్గంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు గంగపుత్రుల అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా నగదు బదిలీ చేయాలని, గత 12 సంవత్సరాల్లో మరణించిన 986 మంది మత్స్యకార కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి మత్స్యకారుడికి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను 90 శాతం రాయితీపై అందించాలని, మత్స్యకార సహకార సంఘాల సభ్యులందరికీ రూ.20 లక్షల బీమా, ఎక్స్‌గ్రేషియా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పట్టణ యువజన అధ్యక్షుడు మంచెర్ల సదానందం, శాఖపురం భీమ్సేన్, గగ్గూరి రాజన్న, మనోహర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన 11 కేవి విద్యుత్ స్తంభం

### పడిపోతే గ్రామాలు అంధకారమే


మెదక్ జులై 10 సిరి న్యూస్



మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని 33/11 కేవీ కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నారం–అబులాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న 11 కేవీ ఫీడర్‌పై ఉన్న విద్యుత్ స్థంభం ప్రమాదకరంగా వంగిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థంభం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాలకు విద్యుత్ సరఫరా అందిస్తున్న ప్రధాన 11 కేవీ లైన్‌కు చెందిన సిమెంట్ స్థంభం ఒకవైపుకు బాగా వంగిపోయింది. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో బలమైన గాలులు, భారీ వర్షాలకు స్థంభం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఒకవేళ ఈ స్థంభం నేలకొరిగితే అన్నారం అబులాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే గ్రామాల్లో తాగునీటి బోర్లు, వ్యవసాయ మోటార్లు, గృహ అవసరాలు, చిన్న వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా విద్యుత్ తీగలు నేలపై పడితే ప్రజలు, పశువులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని చెబుతున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, సమస్యను సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే స్పందించి వంగిన స్థంభాన్ని తొలగించి కొత్త స్థంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## అనుమతులు లేని టింబర్ డిపో సీజ్







- మెదక్ శ్రీ కృష్ణ సామెల్ టింబర్ డిపో లో అక్రమ కలప దందా
- కోర్టుస్టే సాకుతో లైసెన్సు రెన్యువల్ చేయని యాజమాన్యం
- విచ్చలవిడిగా అనుమతుల్లేని టేకు కలప డంపు.
- 158 సీఎంటిల టేకు కలప పట్టివేత.
- 2025 టేకు కలప మొద్దులకు మార్క్ చేసిన ఫారెస్ట్ అధికారులు..
- సామెల్ డిపోలోని మిషినార్లకు సీల్ వేసి నోటీసులు.
- డిపో సీజ్ చేసి సీల్ వేసిన మెదక్ ఫారెస్ట్ అధికారులు

మెదక్ జూలై,10 (సిరి న్యూస్)

అనుమతులకు విరుద్ధంగా నిలువ చేసిన అక్రమ టేకు కలప డంపును మెదక్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గణేష్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. మెదక్ పట్టణ పరిధిలోని శ్రీకృష్ణ సామెల్ టింబర్ డిపో ను గతం లోనే సీజ్ చేయడం జరిగింది. కానీ టింబర్ డిపో యజమాని కోర్టు స్టే పేరుతో అధికారుల కళ్ళు కప్పి టింబర్ డిపోను యధావిధిగా నడిపిస్తున్నాడు. కానీ పరిమితికి మించి టేకు కలపను డప్పు చేసి అక్రమ తందని నిర్వహిస్తున్న సమాచారం మేరకు మెదక్ ఫారెస్ట్ అధికారులు శుక్రవారం సామెల్ డిపో తో పాటు 158 సీఎంటీల టేకు కలప దాదాపు 2025 టేకు మొద్దులు ఉంటాయని అంచనా వేశారు. టింబర్ డిపో లోని మిషనరీలను సీల్ వేసి నోటీసులు జారి చేశారు.

## ఇంటింటికీ కాదు...రోడ్డెక్కిన ఎస్ఐఆర్.!..

- ఇంటింటికీ ఎస్ఐఆర్ ఎక్కడ..? రోడ్డుపైనే నమోదు.!..
- ఎన్నికల సంఘం నిబంధనలు బేఖాతరా.?..
- బీఎల్‌వోల తీరుపై ఓటర్ల ఆగ్రహం..

* ఓటు హక్కు ప్రమాదంలో పడుతుందా.?..

- స్పందిస్తారా అధికారులు... చర్యలుంటాయా.?..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూలై 10 ( సిరి న్యూస్ ) :



ఇంటింటికీ ఎస్ఐఆర్ అంటూ రాజకీయ పార్టీలు ప్రచారం చేస్తూ ప్రజలకు దరఖాస్తు పత్రాలు అందజేస్తూ ఫోటోలు దిగడం ఒకవైపు కొనసాగుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి..ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, ఇంటి గడపకు చేరాల్సిన ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రోడ్డుపైనే కొనసాగుతున్నాయి అనడానికి ప్రత్యేక సాక్షం ఈ దృశ్యాలు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బూత్ స్థాయి బిఎల్ఓలు, ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి, వారి సమక్షంలోనే ఎస్ఐఆర్ దరఖాస్తు పూర్తి చేసి, ప్రభుత్వం అందుబాటులో ఉంచిన మొబైల్ అనువర్తనం ద్వారా అక్కడికక్కడే నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో మాత్రం కొందరు బూత్ స్థాయి బిఎల్ఓలు రోడ్ల పక్కన కుర్చీలు వేసుకుని ప్రజలనే తమ వద్దకు రమ్మని పిలుస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఫారాలు ఇచ్చి వెళ్లండి...తర్వాత నమోదు చేస్తాం మాకు సమయం లేదు పనిభారం ఎక్కువగా ఉంది తర్వాత ఇంటికి వస్తాం అంటూ ప్రజలను వెనక్కి పంపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను పక్కనబెట్టి ప్రజలపై అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులు, దివ్యాంగులు, అమాయక ఓటర్లేనని స్థానికులు చెబుతున్నారు. తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో, ఏ వార్డులో నమోదైందో, తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో కూడా తెలియని పరిస్థితిలో ఉన్న వారికి పూర్తి సహకారం అందించాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులదేనని గుర్తు చేస్తున్నారు. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే, కొందరు బూత్ స్థాయి బిఎల్ఓలే ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఓటర్ల వివరాల నమోదులో పొరపాట్లు జరిగే ప్రమాదం ఉందని, చివరికి ఓటు తొలగిపోయినా బాధ్యత ఎవరు.? వహిస్తారనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. స్థానికులు అందించిన ఫోటోల్లో కూడా బూత్ స్థాయి బిఎల్ఓలు రోడ్డుపక్కనే కుర్చీలు వేసుకుని దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ దృశ్యాలు స్థానికులు చేస్తున్న ఆరోపణలకు బలాన్నిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. అయితే ఈ ఘటనపై అధికారుల స్పందన రావాల్సి ఉంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు. అలాంటి కీలకమైన ప్రక్రియలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటే వేలాది మంది ఓటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఉన్నత ఎన్నికల అధికారులు వెంటనే ప్రత్యేక విచారణ చేపట్టి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అమలవుతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న బిఎల్ఓలపై కఠిన చర్యలు తీసుకుని, ప్రతి ఓటరికి ఇంటి గడప వద్దనే ఎస్ఐఆర్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.. ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల ఆందోళనలు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులపై సిరి తెలుగు దినపత్రిక నిఘా కొనసాగిస్తోంది. ఈ అంశాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు రంగంలోకి దిగి, ఎస్ఐఆర్ అమలులో జరుగుతున్న నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటారా? ప్రతి ఓటరికి ఇంటి గడప వద్ద సేవలు అందేలా హామీ ఇస్తారా? వేచి చూడాల్సిందే. ఓటర్ల హక్కులు కాపాడబడి, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో భద్రంగా నమోదయ్యే వరకు సిరి తెలుగు దినపత్రిక వరుస కథనాలతో ప్రజల పక్షాన ముందుండనుంది. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కుపై ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమన్న సంకల్పంతో ఈ అంశాన్ని నిరంతరం వెలుగులోకి తీసుకువస్తామని సిరి తెలుగు పత్రిక స్పష్టం చేస్తోంది..

## ఓటరు గడువులోగా వివరాలు నమోదు చేసుకోవాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
- కొత్తపల్లి గ్రామంలో ఇంటింటికీ ఫారాల పంపిణీ పరిశీలన

గుమ్మడిదల, జూలై 10 (సిరి న్యూస్):

గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తూ, వాటిని నింపే విధానంపై అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకమని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపు సమర్పించాలని సూచించారు. బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి స్థాయిలో సహకరించి ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయాలని, గ్రామస్తులు కూడా అధికారులతో సమన్వయం చేసుకుని ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో శోభ, బీఎల్ఏలు విజయ్ కుమార్, రమేష్, గ్రామస్తులు చాకలి చంద్రయ్య, ఆగం వెంకటస్వామి, కుమ్మరి వీరస్వామి, ఆగం మల్లేశం, గడ్డమీది వీరమణి, పాలాటి అనసూయ, కుమ్మరి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వద్దు బాబోయ్ పెళ్లి..





పెళ్లి.. ఒకప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. చదువుకుని, ఉద్యోగం సంపాదించి, పెళ్లిచేసుకుంటే హమ్మయ్యా లైఫ్ లో సెటిల్ అయ్యాం అనుకునే వారు. కానీ ఇప్పుడు కాలం మారింది. కాలంతో పాటు మనుషులు కూడా మారుతున్నారు. వయసు పెరిగిపోతున్నా పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటున్నారు చాలామంది. ఎందుకు చేసుకోవడంలేదని ప్రశ్నిస్తే 'అంత రిస్క్ చేయలేం' అంటున్నారు. ఇంతకీ పెళ్లిలో అంత రిస్క్ ఉంటుందా? .. పెళ్లంటే యువత ఎందుకు ఆసక్తి చూపడం లేదు. దీని గురించి రిలేషన్ షిప్ నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం.

అప్పట్లో యువత.. వచ్చే వరుడు,వధువు గురించి కలలు కంటూ ఊహల్లో తేలిపోతూ ఉండేవారు. 21 సంవత్సరాలకే వివాహం చేసుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. 30 దాటినా అమ్మాయిలు, అబ్బాయిలు పెళ్లి చేసుకోవడంలేదు. కొంతమంది అయితే పెళ్లంటేనే వద్దు బాబోయ్ అంటూ పారిపోతున్నారు. ముఖ్యంగా పురుషులు పెళ్లి చేసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో పెళ్లి కాని ప్రసాదులుగా మారిపోతున్నారు.

ప్రస్తుతం యువత ఎక్కువగా చదువు కంప్లీట్ చేసుకుని, ఉద్యోగాలు, వ్యాపారాలు, స్టార్టప్ లు అంటూ కాంపిటేటివ్ ప్రపంచంలో బిజీగా ఉంటున్నారు. ఇంట్లో వాళ్లు పెళ్లి గురించి టాపిక్ ఎత్తితే. నాకు ఇప్పుడే వద్దు అంటున్నారు. మ్యారేజ్ సిస్టమ్ మీద నమ్మకం లేకో లేదా పెళ్లి చేసుకోవడం నిజంగా ఇష్టం లేకో అయితే ఓకే. కానీ ఈ రోజుల్లో చాలామంది యువత పెళ్లి తర్వాత ఎదురయ్యే కొన్ని చిన్న చిన్న భయాలతోనే పెళ్లికి దూరంగా ఉంటున్నారని నిపుణులు చెబుతున్నారు.

పెళ్లి తర్వాత ఫ్రీడమ్ ఉండదేమో? ..కెరీర్ కాంప్రమైజ్ చేయాల్సి వస్తుందేమో? ..వచ్చే పార్టనర్ ఎలా ఉంటారో? ..ఇలాంటి భయాల వల్లే చాలామంది పెళ్లికి దూరంగా ఉంటున్నారని సర్వేలు చెప్పుతున్నాయి. పెళ్లికి ముందు ఇలాంటి భయాలు ఉండడం మామూలే కానీ ఈ భయాల కోసం నిజంగా పెళ్లిని దూరం పెట్టడం మంచిది కాదని నిపుణులు అంటున్నారు. పెళ్లి తర్వాత వ్యక్తిగత జీవితం, స్నేహితులతో గడపడం, ఇష్టమైన పనులు చేసుకోవడం వంటి వాటికి సమయం ఉండదని యువత అనుకుంటున్నారంటా. పెళ్లి తర్వాత బాధ్యతలు పెరుగుతాయి, వాటికి కట్టుబడి ఉండాల్సి వస్తుంది. స్వేచ్ఛను కోల్పోవడానికి ఇష్టపడని వారు పెళ్లికి దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారంటా.

అలాగే.. నేటి కాలంలో విడాకులు సర్వసాధారణం అయిపోయాయి. పెళ్లి చేసుకున్న కొద్ది రోజులకే విడిపోతున్న జంటలను చూస్తూనే ఉన్నాం. విడాకులు తీసుకోవడం వల్ల ఆర్థికంగా, మానసికంగా చాలా నష్టం వాటిల్లుతుంది. విడాకుల తర్వాత కోర్టుల చుట్టూ తిరగడం, మనశ్శాంతి కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి. విడాకుల భయంతో చాలా మంది యువత పెళ్లి చేసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారంటా.





పెళ్లితర్వాత జీవితంలో అందమైన, అద్భుతమైన విషయాలెన్నో జరగొచ్చు. కాంప్రమైజ్ అవ్వాల్సి వచ్చినప్పుడు అవుతారు. లేకపోతే లేదు. దాని గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడి తెచ్చుకోవడం, పెళ్లి మీద భయాన్ని పెంచుకోవడం అనవసరం అంటున్నారు నిపుణులు.

ఒకవేళకాంప్రమైజ్ అవ్వాల్సి వస్తే అది లైఫ్ పార్టనర్ కోసమో, పిల్లల కోసమో అవ్వాల్సి వస్తుంది. అది తప్పు కాదు. ప్రేమతో కాంప్రమైజ్ అవ్వడం వ్యక్తిత్వాన్ని చంపుకున్నట్టు కాదు అని రిలేషన్ షిప్ నిపుణులు చెపుతున్నారు.

## రోబోల మధ్య డిష్యుం డిష్యుం

# చైనాలో మరో వింత







**మనం సాధారణంగా మనుషుల మధ్య బాక్సింగ్ పోటీలు జరగడం చూశాం. కానీ చరిత్రలో మొదటిసారిగా, మనుషులలాగే కనిపించే రోబోల మధ్య బాక్సింగ్ పోటీ జరగబోతోంది. ఇందుకు చైనా దేశం వేదిక కానుండటం విశేషం. ప్రపంచంలో తొలిసారిగా వచ్చే నెల రోబో బాక్సింగ్ పోటీలు చైనాలో తలపడబోతున్నాయి. చైనాకు చెందిన 'యూనిట్రీ' అనే రోబోటిక్స్ కంపెనీ ఈ అసాధారణమైన ఈవెంట్‌ను ప్రకటించింది.**

మనం సాధారణంగా మనుషుల మధ్య బాక్సింగ్ పోటీలు జరగడం చూశాం. కానీ చరిత్రలో మొదటిసారిగా, మనుషులలాగే కనిపించే రోబోల మధ్య బాక్సింగ్ పోటీ జరగబోతోంది. ఇందుకు చైనా దేశం వేదిక కానుండటం విశేషం. ప్రపంచంలో తొలిసారిగా వచ్చే నెల రోబో బాక్సింగ్ పోటీలు చైనాలో తలపడబోతున్నాయి. చైనాకు చెందిన 'యూనిట్రీ' అనే రోబోటిక్స్ కంపెనీ ఈ అసాధారణమైన ఈవెంట్‌ను ప్రకటించింది. రోబోలు ఇప్పటికే మనుషులు నిర్వహించే అనేక రంగాల పనులు చేస్తున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు వ్యవసాయం వంటి పనుల్లోనూ మనుషుల కంటె బెటర్ గా వ్యవహరిస్తున్నాయి. మనుషులు చేయలేని రెస్క్యూ ఆపరేషన్ లు సైతం చేస్తూ మానవాళికి సేవలందిస్తున్నాయి. ఇప్పుడు క్రీడల్లోనూ రోబోలు రంగ ప్రవేశం చేస్తున్నాయి. హ్యూమనాయిడ్ రోబోలు ఎంత చురుగ్గా మారాయి, వాటి వేగం, పోరాడే శక్తి ఎంత పెరిగిందో చూపించడానికి ఇదొక పెద్ద ముందడుగు అని చెప్పొచ్చు. ఏ రోబోలు ఈ బాక్సింగ్‌లో పాల్గొంటాయో యూనిట్రీ ఇంకా అధికారికంగా చెప్పలేదు కానీ, ఎక్కువగా ఆ కంపెనీకి చెందిన G1 హ్యూమనాయిడ్ రోబోలే బరిలోకి దిగే అవకాశం ఉంది.

రోబో బాక్సింగ్ పోటీలో 4.3 అడుగుల ఎత్తున్న జీ1తో 5.11 అడుగుల ఎత్తున్న H1 హ్యూమనాయిడ్ రోబో తలపడనుంది. అత్యుత్తమ కంప్యూటరీ శక్తి, చురుకైన కదలికలు, నియంత్రణ ఈ రోబోల సొంతం. పోటీలో ప్రత్యర్థి పంచ్ ల నుంచి తప్పించుకోవడం, ఎదురుదాడి కిక్ పంచ్ లు కొట్టడంలో మరి ఈ మర మనుషుల బాక్సర్ లు ఏవిధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరం. రోబోల బాక్సింగ్ మనుషుల మధ్య జరిగే బాక్సింగ్ మాదిరిగా భావోద్వేగాలతో సాగుతుందా లేక మరమనుషులు మాదిరిగానే కృత్రిమంగా కొనసాగుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

ఈ బాక్సింగ్ కోసం రోబోలకు శిక్షణ ఇంకా కొనసాగుతోంది. బాక్సింగ్ కోసం వాటికి ఇంకా శిక్షణ ఇస్తున్నామని యూనిట్రీ వారు చెప్పారు. వాటి మధ్య సమన్వయం, దెబ్బలను తప్పించుకోవడం , బ్యాలెన్స్ వంటి విషయాలను మెరుగుపరచడానికి వారి టీమ్ ఇంకా కష్టపడుతూనే ఉంది. అసలు పోటీకి ఇంకా కొన్ని వారాల సమయం ఉంది కాబట్టి, ఈలోపు మరిన్ని మెరుగులు దిద్దే అవకాశం ఉంది. ఈ రాబోయే మ్యాచ్ కేవలం ఒక ఆట కాదు, ఇది రోబోటిక్స్ టెక్నాలజీ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చూపించే ఒక చిన్న ట్రైలర్ లాంటిది. రింగ్‌లో చిన్న G1 రోబో ఉన్నా, బలమైన H1 రోబో ఉన్నా, యూనిట్రీ మాత్రం ప్రపంచం ఇంతకు ముందెన్నడూ చూడని ఒక సరికొత్త టెక్నాలజీ పోరుకు రంగం సిద్ధం చేస్తోంది.



## వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన

# చిరు షూటింగ్

### మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం

ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది. 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# జన నాయగన్ విడుదలకు సిద్ధం


విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.




# నేడు విడుదలవుతున్న ..లెనిన్

### మరికొన్ని డబ్బింగ్ మూవీలు కూడా సందడి

ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్గడ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు. ఇకపోతే మైథాలజీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న చిత్రం 'వాసుదేవ సుతం'. పూరీ జగన్నాథ ఆలయంలో దాగి ఉన్న ఒక పవిత్రమైన శక్తిని రక్షించడానికి ఒక యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా కథ. మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి, సుమేధా బజాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వైకుంఠ్ బోను దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతాన్ని సమకూర్చారు.ఇకపోతే మలయాళంలో విడుదలై తెలుగులో రాబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'. నిసామ్ బషీర్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, ఒక భారీ బ్యాంక్ దోపిడీ కేసులో అన్యాయంగా ఇరుక్కున్న ఒక సాధారణ వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించు కున్నాడు అనే కథతో సాగుతుంది. తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం 'లవ్ ఓ లవ్' కూడా నేడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. మహేష్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిష్ నారాయణన్, నాగ దుర్గ, ఆదిత్య కతిర్ నటించిన ఈ సినిమా, అప్పుల్లో మునిగిపోయిన ఒక యువకుడి ప్రేమకథ చుట్టూ తిరుగుతుంది. ఇందులో ప్రముఖ దర్శకులు సెల్వరాఘవన్, కె. ఎస్. రవికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ప్రేమ, బ్రేకప్ మరియు గుండె లోతుల్లోని భావాల సమాహారంగా వస్తోన్న భావోద్వేగభరిత చిత్రం 'హృదయం మురళి'. అథర్వ మురళి, ప్రీతి ముకుందన్ జంటగా ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాయాదు లోహర్, నిహారిక ఎన్.ఎమ్ ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో 'ఇదయం మురళి'గా, తెలుగులో




'హృదయం మురళి'గా ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలీవుడ్ నుంచి నవ్వుల పండగను తీసుకురావడానికి 'ధమాల్ 4' వస్తోంది. ఇంద్ర కుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, రితీష్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సి, జావేద్ జాఫేరి, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కలయికలో వస్తోన్న ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమైంది. ఇలా విభిన్నమైన జోనర్లతో, భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలతో ఈ శుక్రవారం బాక్సాఫీస్ కళకళలాడబోతోంది.

# మరో సస్పెన్స్ థ్రిల్లర్.. వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది.

ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

# భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిస్

కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దర్శకురాలు గీతూ



మోహన్‌దాస్‌తో పాటు ఇతర కీలక సాంకేతిక నిపుణుల పారితోషికాలు కలిపితే మొత్తం రెమ్యూనరేషన్ వ్యయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటే అవకాశముందని చర్చ జరుగుతోంది. కేవలం నటీనటుల పారితోషికాలే కాకుండా సినిమా నిర్మాణంపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్లు, ప్రత్యేక ఆర్ట్ డైరెక్షన్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అందుకే ఆర్ట్ డిపార్ట్‌మెంట్, యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంకేతిక అంశాలపై కూడా నిర్మాతలు భారీగా పెట్టుబడి పెడుతున్నట్లు సమాచారం

**The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.**